ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.6 కనిష్ఠం 29.9

దేదీప్యమానం..

దశాబ్ది సంబురం..!



ట్యాంక్‌బండ్‌పై స్టాల్‌ను వీక్షిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి

- నగరంలో మిన్నంటిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- ట్యాంక్‌బండ్‌పై అలరించిన కార్యక్రమాలు
- పరేడ్‌గ్రౌండ్‌లో ఆకట్టుకున్న పోలీసుల కవాతు

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో తెలంగాణ దశాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్సవాలు కొనసాగాయి. ఉదయం నాంపల్లి లోని గన్‌పార్క్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ పరేడ్ మైదానానికి చేరుకున్న సీఎం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ గేయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీసు కవాతు ఆకట్టుకుంది. పరేడ్ మైదానంలో అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన కార్యక్రమాలు సందర్శకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. విద్యుత్ ధగధగలు, బాణసంచా వెలుగుల్లో ట్యాంక్‌బండ్ పరిసరాలు కళకళలాడాయి. వర్షం కురిసినప్పటికీ తడుస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ రాధాకృష్ణన్ కూడా ఈ కార్యక్రమాలను వీక్షించారు. కాగా, నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ అమరుల త్యాగాలు, సకల జనుల పోరాటంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాను నంబర్ 1 స్థానంలో నిలిపేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



డప్పు కళాకారుల విన్యాసం



వేదికపై కళాకారుల నృత్యం



పరేడ్‌మైదానంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం తదితరులు



గన్‌పార్క్‌లో నివాళి అర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి



కమాండ్ కంట్రోల్‌రూంలో జెండా వందనం చేస్తున్న జాయింట్ సీపీ అడ్మిన్ పరిమళ హోనా నూతన్



సైబరాబాద్ కమిషనరేట్‌లో మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి



జాతీయ జెండా వందనం చేస్తున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి



వేడుకలకు హాజరైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

అమరవీరులకు ఉద్యమకారుల నివాళులు 8

వచ్చేనెల 7నుంచి ఆషాఢ బోనాలు





ఆదివారం పగటి ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు సాయంత్రం కురిసిన వర్షంతో తడిసిముద్దయ్యారు. ప్రధానంగా కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కూకట్‌పల్లిలో కురిసిన వర్షానికి మునిగిన రహదారి, వానలో ఆగిన బండితో వాహనదారుడి తిప్పలు చిత్రాల్లో చూడొచ్చు.

ఎండల తీవ్రత.. ధరల మోత..!

- మళ్లీ పెరిగిన కూరగాయల రేట్లు
- పది రోజులతో పోల్చితే 30 శాతం అధికం
- చికెన్ లైవ్ కిలో రూ.190, స్కిన్‌లెస్ రూ.290-300
- సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరాఘాతం

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో కూరగాయల ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. రూ.100కు కనీసం రెండు మూడు రకాల కూరగాయలు కూడా రావడం లేదని సామాన్యులు వాపోతున్నారు. పెరిగిన ఎండల తీవ్రతతో దిగుబడులు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి.

పప్పుల ధరలకు తోడు..

ఇప్పటికే పప్పుల ధరలు బాగా పెరిగాయి. రిటైల్ దుకాణాల్లో కందిపప్పు కిలో రూ.190, మినపప్పు రూ.150, శనగపప్పు రూ.80 ఉన్నాయి. ఇప్పుడు కూరగాయల



రేట్లు గుబులు పుట్టిస్తున్నాయి. పది రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చితే 20 నుంచి 30 శాతం అదనంగా పెరిగాయి. ఉదాహరణకు మే 23న రిటైల్ మార్కెట్‌లో కిలో టమాట రూ.25 ఉండగా,

మిగతా 8వ పేజీలో..

గెలుపెవరిదో?

- అభ్యర్థులు, పార్టీ నేతల్లో టెన్షన్
- సాధారణ పౌరుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు చర్చ
- అప్పుడే మొదలైన విశ్లేషణలు
- ఎగ్జిట్ పోల్స్‌తో వేడెక్కిన రాజకీయం

రేపే ఓట్ల లెక్కింపు



మూడు వారాల క్రితం పోలింగ్.. ఇన్నాళ్లూ కూల్‌గా ఉన్న రాజకీయ వాతావరణం ఎగ్జిట్ పోల్స్ వెల్లడితో వేడెక్కింది. లెక్కింపు ముహూర్తం సమీపించడంతో మరింత ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతోన్న వేళ ఉద్యమస్మృతులు నెమరువేసుకుంటూనే.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై చర్చిస్తున్నారు. సాధారణ పౌరుల నుంచి పార్టీల నేతలు, పారిశ్రామికవేత్తల వరకు గెలుపెవరిది..? ఏ పార్టీ ఎక్కడ గెలిచే అవకాశముంది..? ఏ స్థానంలో ఎవరు గెలుస్తారు..? ఏ ఎగ్జిట్ పోల్ వాస్తవం కానుంది..? గతంలో ఆయా సంస్థలు చేసిన సర్వేలు ఎంత వరకు నిజమయ్యాయి..? అనే అంశాలే చర్చకు వస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల్లో నిక్షిప్తమైన భవితవ్యం రేపు వెల్లడి కానున్న నేపథ్యంలో పార్టీల కీలక నేతలు, అభ్యర్థులు, వారి అనుచరులు.. కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది. పలు స్థానాలకు సంబంధించి మెజార్టీ సర్వే సంస్థలు ఏ పార్టీ విజయం సాధించే అవకాశముందన్నది ప్రకటించినా.. ఆ పార్టీల అభ్యర్థులూ ధీమాగా కనిపించడం లేదు. ఫలితాలు వెల్లడైతే తప్ప ఏం జరుగుతుందో చెప్పడం కష్టమని ప్రధాన పార్టీ అభ్యర్థి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. రేపు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. ఐదారు రౌండ్లలో ట్రెండ్ తెలిసే అవకాశముందని, ఏ లోక్‌సభ స్థానం లో ఏ పార్టీ/అభ్యర్థి గెలిచే అవకాశముందన్న దానిపై దాదాపుగా అంచనాకు రావచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు కీలకంగా మారాయి. కౌంటింగ్ పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా ప్రభుత్వ విభాగాలు ఏర్పాట్లు చేశాయి.

గతంలో తలా ఒకటి..

మహానగరం పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. 2019లో బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం తలో స్థానం దక్కించుకున్నాయి. ఈసారి రాజకీయ పరిణామాలు భిన్నంగా ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. గెలుపు కోసం

మిగతా 8వ పేజీలో..

ఎగ్జిట్‌పోల్స్‌తో ఆశల పల్లకిలో కమలం 8



నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ట్రై కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలతో పాటు, సిటీ కమిషనరేట్ పరిధిలో జరిగిన కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ట్రై కమిషనరేట్ సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అవినాశ్ మహంతి, తరుణ్‌జోషి తెలిపారు. పటిష్టమైన నిఘా, పోలీస్ బందోబస్తు మధ్య లెక్కింపు జరగనున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత, బందోబస్తును ట్రై కమిషనరేట్ సీపీలు ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నారు.

24 గంటలు.. 144 సెక్షన్

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం లెక్కింపు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీలు వెల్లడించారు. మూడంచెల భద్రతలో భాగంగా మొదటి వలయంలో కేంద్ర ఆర్మీ బలగాలు, రెండో దశలో తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్, మూడో వలయంలో నగర పోలీసులు ఉంటారు. మొత్తంగా ఒక్కో కేంద్రం వద్ద 130 నుంచి 150 మంది అదనపు కమిషనర్, డీసీపీ, ఏసీపీ స్థాయి పోలీస్ అధికారులు,

మిగతా 6వ పేజీలో..

నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు

(5వ పేజీ తరువాయి): సిబ్బంది ఉంటారు. కేంద్రానికి ఇరువైపులా 100 మీటర్ల దూరంలో వాహనాల తనిఖీ ఉంటుంది. లెక్కింపు నేపథ్యంలో నగరమంతా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మర్నాడు ఉదయం ఆరు గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం విధించారు. రంగులు చల్లుకోవడం, బాణసంచా కాల్చడం వంటివి చేయొద్దని సీపీలు హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుల కుటుంబాలను, ఉద్యమంలో పాల్గొని వృద్ధులైన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి స్పష్టమైన హామీ వస్తుందనే ఆశలపై నీళ్లు చల్లారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్‌గా వ్యవహరించిన దొంతు ఆనందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వయోవృద్ధులైన ఉద్యమకారులకు పెన్షన్, ఇళ్లు లేని వారికి 250 చ.గ స్థలం, ఇళ్ల నిర్మాణం వంటి పథకాలపై స్పష్టమైన ప్రకటన వస్తుందని ఆశించినట్లు తెలిపారు.



జూపార్కులో జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న క్యురేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, కార్యక్రమంలో ఉద్యోగులు



వ్యవసాయశాఖ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అగ్రికల్చర్ ఆఫీసర్లు శిరీష, రేణుక తదితరులు



రాజేంద్రనగర్‌వ్యవసాయ వర్సిటీలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

● ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులు ● జాతీయ జెండాను ఎగురవేసిన అధికారులు, నాయకులు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్ల పూర్తి కావడంతో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. చార్మినార్, రాజేంద్రనగర్, నాంపల్లి, బహదూర‌పురా, కార్వాన్, మెహిదీపట్నం, ఆబిడ్స్, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంత్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్, బుద్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, హైదర్‌గూడ గాంధీ విగ్రహం వద్ద అత్తాపూర్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ జాతీయ జెండా ఎగురవేశారు. మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, రాజేంద్రనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. రాజేంద్రనగర్‌లో ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.అమరేందర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేంద్రనగర్ వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బహదూర్‌పురా మండల కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, బహదూర్‌పురా పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రఘునాథ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కరుణకుమార్, కామాటిపురాలో ఇన్‌స్పెక్టర్ వై.కమల్‌కుమార్, హుసేనిఆలంలో ఇన్‌స్పెక్టర్ సురేందర్, కాలాపత్తర్‌లో ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీ, చాంద్రాయణగుట్టలో ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్, బండ్లగూడ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ జాతీయ జెండాలు ఎగురవేసి సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు.

చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ టి.వెంకన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జూపార్కులో క్యురేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్ జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు విభాగాల్లో వేడుకలు నిర్వహించారు.

రెడ్‌హిల్స్‌లోని సింగరేణి కార్యాలయం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, టీఎస్జీవో భవన్, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయాలతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా వారన్నారు.

- (చార్మినార్, ఆబిడ్స్, మెహిదీపట్నం జోన్ బృందం)



లాల్‌దర్వాజ మోడ్ వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జెండావిష్కరణలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు



బుద్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య తదితరులు



హైదర్‌గూడలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జెండాను ఎగురవేస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్, తదితరులు



జంగమ్మెట్ డివిజన్‌లో సుష్మాస్వరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు మహేందర్, శ్రీనివాస్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కన్వీనర్ పండరీనాథ్ తదితరులు



శివరాంపల్లి ఎస్ఆర్ డీజీ స్కూల్ వద్ద జెండాను ఎగురవేస్తున్న ఉపాధ్యాయులు



పాతబస్తీ రాజన్నబావి వద్ద జెండాను ఎగురవేస్తున్న శాలిబండ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయినాథ్ తదితరులు



జోనల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న జోనల్ కమిషనర్ టి.వెంకన్న



గౌలిపురా డివిజన్ మంగల్‌ముఖి హనుమాన్ ఆలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి తదితరులు



సింగరేణి భవన్‌లో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మూమెంట్ డాక్టర్ అల్విన్



మైలార్‌దేవుపల్లిలో జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి, తదితరులు



ఉస్మానియా ఆస్పత్రిలో సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు



ఉస్మానియాలో ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆశిష్ కుమార్ యాదవ్, కోటి శైలేష్ కురుమ తదితరులు



గన్‌పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి పూలమాల వేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు, నిర్మల్ కుమార్‌యాదవ్, రాకేశ్ సింగ్, శోభా తదితరులు



గన్‌పార్కు వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కమిటీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి తదితరులు



గోషామహల్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు జయశంకర్, యాదగిరి తదితరులు



ఫారూక్‌నగర్ ఆర్టీసీ బస్ డిపోలో జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న చార్మినార్ డిప్యూటీ ఆర్ఎం విజయ్‌భాను, ఫారూక్‌నగర్ డిపో మేనేజర్ బద్రినారాయణ్

ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల

రాష్ట్ర అడ్‌హక్ కమిటీ నియామకం

మంగళ్‌హట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి గన్‌పార్కు వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రకటించారు. విష్ణువర్ధన్‌గౌడ్, ఎండీ రహీం, గుజ్జల శ్రీనివాస్, డాక్టర్ గజ్జల మల్లేష్, ఎండీ పాషా, ఎస్.కుమార్, కిరణ్ గౌడ్, సందీప్, ఉపేందర్, భూక్యా రాంనాయక్, రమేశ్ గౌడ్, రాంచంద్రా యాదవ్, దిలీప్, శ్రీనివాస్‌గౌడ్, పి.భూపాల్, టి.రాజేశ్ ముదిరాజ్, సంతోష్, శివగౌడ్, శ్రీనాథ్, బి.సమ్మయ్య, బి.జాన్, అందె కృష్ణ, ఎం.వెంకట్, పార్వతీ, టి.శ్వేత, కరణ్ జైరాజ్, ఎం.రాజు, ఎం.రవి, సుదీప్, దేవిరెడ్డి ఉదయ్, బంటు భూమేశ్ పేర్లను పిడమర్తి రవి అధికారికంగా ప్రకటించారు.

ఔటర్ రింగు రోడ్డుపై కారు బోల్తా

● ఐదుగురికి స్వల్పంగా గాయాలు



ధ్వంసం అయిన వాహనం

రాజేంద్రనగర్, జూన్2(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డుపై వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఔటర్ రింగ్‌రోడ్డుపై ఒక దానికి ఒకటి ఆరు కార్లు ఢీకొన్న సంఘటన మరవకముందే ఆదివారం మరో ప్రమాదం జరిగింది. ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన ఏడుగురు స్నేహితులు ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో సఫారీ వాహనంలో శంషాబాద్ వైపునకు వెళ్తున్నారు. హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్‌రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొడుతూ రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలం వద్దకు వచ్చి గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సాయంతో చెట్ల పొదల్లో నుంచి కారును బయటకు తీశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' రాజేంద్రనగర్ ఎస్ఐ రమేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

వ్యవసాయ రంగ అభివృద్ధికి పునరంకితమవుదాం: రిజిస్ట్రార్

రాజేంద్రనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో వ్యవసాయ రంగం అభివృద్ధికి పునరంకితమవుదామని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆ దిశగా శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, ఉద్యోగులు, కార్మికులు పనిచేయాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిపాలనా భవనంపై జాతీయ జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా వారు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసం కన్న కలలను,తెలంగాణ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశించిన తెలంగాణ రాష్ట్ర సాధనలో వ్యవసాయ విశ్వవిద్యాలయం సైతం ముందుండి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు డాక్టర్ సీమ, డాక్టర్ అనిత, డాక్టర్ జిల్లా సత్యనారాయణ, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ వి.సుధారాణి, డాక్టర్ జమునారాణి, శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివాజీ, డాక్టర్ వన్నేజ్ సుధాకర్, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుల అరెస్ట్

● 3.5 తులాల బంగారు గొలుసు స్వాధీనం

అఫ్జల్‌గంజ్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 3.5 తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సుల్తాన్ బజార్ సబ్ డివిజన్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్, డీఐ మధు కుమార్, ఎస్ఐ రామకృష్ణతో కలిసి వివరాలు వెల్లడించారు.

మల్లేపల్లి మంగార్ బస్తీకి చెందిన అబ్దుల్ మన్నాన్ (28), మహ్మద్ ఖదీర్(25) ఆటోడ్రైవర్లు. వారి జల్సాలకు డబ్బు సరిపోక పోవడంతో చోరీల బాటపట్టారు. ఇందుకోసం రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి ప్రయాణికుల మెడలలోని బంగారు గొలుసులు చోరీ చేస్తున్నారు. గత నెల 28న అఫ్జల్‌గంజ్ బస్టాప్‌లో బస్సు ఎక్కిన ప్రయాణికుడు శివ కుమార్ మెడలోని గొలుసును చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి అఫ్జల్‌గంజ్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆదివారం ఇద్దరిని అరెస్ట్ చేశాం. నగరంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో మన్నాన్‌పై 22 కేసులు, మహ్మద్ ఖదీర్‌పై 20 కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్, సీఐ లింగేశ్వర్

ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్

బర్కత్‌పుర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా పథకాలను అమలు చేకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యాక్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహ్మద్ ఏజాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సునీల్‌జాదవ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం సునీల్‌జాదవ్ మాట్లాడుతూ దశాబ్ది వేడుకల సందర్భంగా అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే జీహెచ్ఎంసీ, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. హైదరాబాద్ అధ్యక్షుడు మహ్మద్ ఏజాజ్ మాట్లాడుతూ నగరంలో పార్టీని బలోపేతం చేస్తానని, ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు అంజుమ్ పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Gg7Cnb9 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఛత్రినాకలో అదృశ్యం హోటల్ గదిలో శవమై లభ్యం

● ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గత నెల 31న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడి స్నేహితులు, బంధువుల ఇళ్ల వాకబు చేయగా ఆచూకీ లభించలేదు. దాంతో తల్లిదండ్రులు ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ లోగా అతడు ఓయో హోటల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాల్లోకి వెళితే... ఛత్రినాక ప్రాంతానికి చెందిన ఎం.రాహుల్(21) సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఇంటినుంచి గతనెల 31 బయటకు వచ్చిన రాహుల్ జూన్ 1న కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓయో హోటల్ రూం అద్దెకు తీసుకున్నాడు. అదే రోజు రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోటల్ సిబ్బంది కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాహుల్ ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక ఎవరైనా చంపి ఉరివేశారా..? మరేదైనా ఇతర కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఛత్రినాక నుంచి రాహుల్ కాచిగూడకు ఎందుకు వచ్చాడు.? రూము ఎందుకు అద్దెకు తీసుకున్నాడు.? హోటల్లోనే చనిపోవాల్సిన అవసరం ఏంటీ అనేది ప్రశ్నార్థకంగా మారింది


క్లాక్‌టవర్ వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు


అమరవీరులకు తొలి, మలిదశ ఉద్యమకారుల నివాళులు

సికింద్రాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరవీరులకు తొలి, మలిదశ ఉద్యమకారులు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్దనున్న అమరవీరుల స్మారకస్తూపం వద్ద తొలిదశ(1969), మలిదశ (1996 నుంచి) ఉద్యమకారులు నివాళులర్పిస్తూ అమరుల ప్రాణ త్యాగాల కారణంగానే నేడు తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైందని అన్నారు. వారి త్యాగాలను వృథా పోనివ్వకుండా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని వారు అభిప్రాయపడ్డారు. నివాళులర్పించిన వారిలో పాశం యాదగిరి, వన్నాల శ్రీరాములు, స్తూపం సహ నిర్మాత మీరా సింహ, వేణుగోపాల్, సినీ నిర్మాత రఫీ, జర్నలిస్టు కడకండి వెంకటేష్, మాల మహానాడు నాయకుడు పబ్బతి శ్రీకృష్ణ తదితర ఉద్యమకారులు ఉన్నారు.


పోలీసు అధికారులకు మెడల్స్, ట్రోఫీలను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అంబరాన్ని అంటిన సంబురం..

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై కళాకారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వర్షం కురుస్తున్నా తడుస్తూనే ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించారు.


కలర్ ఫుల్‌గా బాణాసంచా పేలుడు, లేజర్‌షో


ట్యాంక్‌బండ్‌పై వర్షంలోనూ కళాకారుల ఆటా-పాట


ఫుడ్ స్టాల్ వద్ద సందర్శకుల కిటకిట


పోతరాజుల విన్యాసాలు

ఎగ్జిట్‌పోల్స్‌తో ఆశల పల్లకిలో కమలం

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి హైదరాబాద్ ప్రతిష్ఠాత్మకం. అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలు అగ్ని పరీక్షగా మారాయి. 2018 మాదిరిగానే 2023లో ఒకే ఒక సీటుతో సరిపెట్టుకుంది. కార్పొరేషన్, అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతో కొంత ఉనికిని చాటుకుంటూ వచ్చిన బీజేపీకి ఇప్పుడు ఈసారి ఎన్నికల ఫలితాలు భవిష్యత్‌ను నిర్ణయించేవిగా నేతలు భావిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని నాలుగు పార్లమెంట్ స్థానాల్లో మూడు స్థానాలపై పార్టీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఒక సీటులో భారీ ఓటు బ్యాంక్ వస్తుందని ఆశతో ఉన్నారు.

మూడింటిపై నమ్మకం..

సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాలను కైవసం చేసుకుంటామని ఆపార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కమలానికి కంచుకోటగా ఉన్న సికింద్రాబాద్‌లో మరోసారి పాగా వేస్తామని ధీమాగా ఉన్నారు. సికింద్రాబాద్‌లో రెండోసారి బరిలో దిగిన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మళ్లీ విజయం తథ్యమనే నమ్మకంతో ఉన్నారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు హోరాహోరీగా తలపడినప్పటికీ మంచి ఓట్లతో కిషన్‌రెడ్డి గెలుస్తారనే పార్టీ నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి ఈసారి బరిలోకి దిగిన ఈటల రాజేందర్ మొదటి నుంచి విస్తృతంగా పాదయాత్రలు, పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లు, పార్కుల్లో సమావేశాలు నిర్వహించి ఓటర్ల మద్దతు కూడగట్టుకున్నారు. మల్కాజిగిరిలో మొదటిసారి కాషాయ జెండా ఎగుర వేస్తామని బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారు. క్రితం ఎన్నికల్లో ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్ టికెట్ సునీతా రెడ్డికి ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కంటే ఈసారి బీజేపీకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన కొండా విశ్వేశ్వరరెడ్డి తన విజయంపై ధీమాతో ఉన్నారు. ఈసారి భారీ మెజార్టీ సాధిస్తానని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఆయన కుటుంబం యావత్తు ఎన్నికల్లో ప్రచారం చేసింది. గ్రేటర్ పరిసరాలలో మూడు స్థానాల్లో తప్పకుండా పార్టీ విజయఢంకా మోగిస్తుందని బీజేపీ శ్రేణులు ఆశతో ఉన్నారు.

పాతబస్తీలో పట్టు సాధించేనా

ప్రతి ఎన్నికలో పాతబస్తీలో కమలం సత్తా నిరూపించుకునేందుకు ప్రయత్నం చేస్తూ వస్తున్నది. ఈసారి ఇక్కడ నుంచి మహిళా అభ్యర్థి మాధవీలత పోటీ చేశారు. మజ్లిస్‌కు ఆమె గట్టిపోటీ ఇచ్చారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అగ్రనేతలు ఆమెకు మద్దతుగా ప్రచారం చేశారు. నువ్వా..నేనా అనే విధంగా పోటీ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా ఆమె పేరు ప్రచారమైంది. ఆమె ఓటర్లను కలుసుకోవడం, మైనారిటీల ఓట్లు పడే విధంగా ప్రయత్నాలు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆమె పోటీతో పార్టీకి పాతబస్తీలో ప్రాధాన్యం చేకూరిందని, ఓటు బ్యాంక్ గణనీయంగా పెరుగుతుందని ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి హైదరాబాద్‌లో పోలింగ్ శాతం తమకు లాభిస్తుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

వచ్చేనెల 7నుంచి ఆషాఢ బోనాలు

- గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం
- ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు : గాజుల అంజయ్య


గాజుల అంజయ్య

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాల జాతరను వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మీరాలంమండిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 7న గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, వడిబియ్యం సమర్పిస్తామని తెలిపారు. జూలై 10న బల్కంపేట ఎల్లమ్మతల్లికి, 12న జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి, 14న విజయవాడలో కనకదుర్గమ్మ అమ్మవారికి, 18న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, 23న చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి, 25న లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు పాత్రలో బంగారు బోనం, వడిబియ్యం సమర్పిస్తామన్నారు. పాతబస్తీలోని అన్ని దేవాలయాల్లో 19వ తేదీన కలశ స్థాపన, ధ్వజారోహణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 21న అమ్మవారి ఘటస్థాపన, ఊరేగింపును నిర్వహిస్తామన్నారు. లాల్‌దర్వాజ మోడ్ వద్ద స్వాగత వేదిక నుంచి అధికార, అనధికారులు ఘటాలకు స్వాగతం పలుకుతారన్నారు. 28వ తేదీన పాతబస్తీలోని అన్ని దేవాలయాల్లో అమ్మవార్లకు పెద్దఎత్తున బోనాలు సమర్పిస్తామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ప్రధాన దేవాలయాలకు మంత్రులు పట్టువస్త్రాలు సమర్పిస్తారని అన్నారు. అనంతరం 29న పాతబస్తీ ప్రధాన వీధుల్లో సామూహిక ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు.


జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

వాకింగ్, సైక్లింగ్‌తో జబ్బులకు చెక్

- స్టార్ గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల ఎండీ డాక్టర్ గోపీచంద్

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వాకింగ్, సైక్లింగ్‌లతో జబ్బులకు చెక్ పెట్టవచ్చని స్టార్ గ్రూప్ ఆస్పత్రుల ఎండీ డాక్టర్ గోపీచంద్ తెలిపారు. గుండె జబ్బులు, పక్షవాతం, కొన్ని రకాల క్యాన్సర్లు, మధుమేహం వంటి వ్యాధుల ద్వారా మరణాల ప్రమాదాన్ని తగ్గించడానికి కాలినడక, సైక్లింగ్ చాలా దోహదం చేస్తాయన్నారు. సైకిల్ దినోత్సవం, ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని స్టార్ ఆస్పత్రి, సైక్లిస్ట్ గ్రూప్ సమతా యువసంఘ సహకారంతో ఆరోగ్యంపై పొగాకు కలిగించే దుష్ప్రభావాల గురించి ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 కిలోమీటర్ల సైక్లింగ్ ర్యాలీని స్టార్ ఆస్పత్రి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రెగ్యులర్ ఫిజికల్‌యాక్టివిటీ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కాలినడక, సైకిల్ తొక్కడం, ఆటలు ఆడటం వంటి తక్కువశ్రమతో కూడిన సాధారణ శారీరక శ్రమ ఆరోగ్యానికి గణనీయమైన ప్రయోజనాలను కలిగిస్తుందని ఆయన తెలిపారు.

ఎండల తీవ్రత.. ధరల మోత..!

(5వ పేజీ తరువాయి)

తాజాగా రూ.40కి అమ్ముతున్నారు. కొత్తిమీర, పుదీనా లాంటి ఆకుకూరల రేట్లు కూడా అమాంతంగా పెరిగాయి. ఎండల కారణంగానే రేట్లు పెరిగాయని, రైతుల నుంచి సరుకు తక్కువగా వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. కాలనీలు, స్థానిక దుకాణాల్లో ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. శనివారం జూబ్లీహిల్స్‌లోని వారాంతపు సంతలో కిలో టమాటను రూ.40కు విక్రయించారు.

కూరగాయల ధరలు (రిటైల్ మార్కెట్‌లో రూపాయల్లో)

రకం	మే-23	జూన్-2న
టమాట	25	40
పచ్చిమిర్చి	60	80
బెండకాయ	40	50
ఆలుగడ్డ	40	60
క్యాప్సికమ్	60	80

చికెన్.. మళ్లీ పెరిగెన్..!

నగరంలో చికెన్ రేట్లు సైతం ఒక్కసారిగా పెరిగాయి. గత ఆదివారం లైవ్ కోడి కిలో రూ.170 వరకు ఉండగా, తాజాగా రూ.190కు విక్రయించారు. స్కిన్‌లెస్ రూ.270 ఉండగా, ఈ ఆదివారం రూ.290 నుంచి 300 వరకు అమ్మారు. ఎండల తీవ్రతను అడ్డుపెట్టుకుని చాలామంది వ్యాపారులు చికెన్ రేట్లను అమాంతంగా పెంచుతున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. కోళ్ల లభ్యత లేదని చెబుతూ కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరాఘాతానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఇక ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరముండదు

- బీమా బైపాస్ సర్జరీ మేలు ● డాక్టర్ ప్రతీక్ భట్నాగర్


జ్యోతి ప్రజ్వలనతో కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న మాధవీలత కొంపెల్ల

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌హార్ట్ సర్జరీ లేకుండా బీమా బైపాస్ సర్జరీ చేయడం వల్ల బ్రెయిన్‌స్ట్రోక్, కిడ్నీ దెబ్బతినడం, రక్తస్రావం జరిగే ప్రమాదం చాలా తక్కువ అని డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ హార్ట్ ఫౌండేషన్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రతీక్‌భట్నాగర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం లైవ్ ఇన్ బాక్స్ బీమా బైపాస్ సర్జరీ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సదస్సును లతమా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత కొంపెల్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ బీమా అనగా బిలటేరియల్ ఇంటర్నల్ మమ్మరీ అర్టరీ అని వివరించారు. బీమా బైపాస్ సర్జరీతో అనారోగ్య సమస్యలు స్వల్పంగా ఉంటాయని, దీని వల్ల కాలు వాపు లేదా ఇన్ఫెక్షన్ ఉండదన్నారు. ఈ సర్జరీ తర్వాత నాలుగు రోజులలో రోగులు మెట్లు ఎక్కడానికి సిద్ధంగా ఉంటారన్నారు. సంప్రదాయ బైపాస్ సర్జరీ సాధారణంగా పదేళ్లు పని చేస్తుందని తెలిపారు. అయితే, బీమా బైపాస్ సర్జరీ 90శాతం రోగులలో ఇరవై ఏళ్ల తర్వాత కూడా పని చేస్తుందని పేర్కొన్నారు. మాధవీలత కొంపెల్ల మాట్లాడుతూ శస్త్రచికిత్స నిపుణులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంచుకోవాలన్నారు. అర్హులైన పేద రోగులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా అనేక మంది సీనియర్ శస్త్రచికిత్స నిపుణులతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, యూఎస్ఏ నుంచి కూడా బీమా బైపాస్ సర్జరీ నిపుణులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ మూడు అత్యాధునిక బీమా బైపాస్ శస్త్రచికిత్సలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఎలా నిర్వహించాలన్న దానిపై అంతర్జాతీయ అధ్యాపకులతో కూడిన ప్యానెల్‌లో చర్చ కూడా జరిగింది.

ఘనంగా నావిగేషన్ ట్రైనింగ్ స్కూల్ స్నాతకోత్సవం

అల్వాల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బేగంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఆవరణలోని నావిగేషన్ ట్రైనింగ్ స్కూల్ (ఎస్‌టీఎస్) లో 106వ అడ్వాన్స్‌డ్ నావిగేషన్ కోర్సు, 138వ అబ్-ఇనిషియో నావిగేషన్ కోర్సుల స్నాతకోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 106వ గ్రాడ్యుయేషన్ అడ్వాన్స్‌డ్ నావిగేషన్ కోర్సులో ఇద్దరు ఇండియన్ నేవీ అధికారులు, ఒకరు ఇండియన్ కోస్ట్‌గార్డ్, మరొకరు మిత్రదేశానికి చెందిన అధికారి శిక్షణ పొందారు. 138వ అబ్- ఇనిషియో నావిగేషన్ కోర్సులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఇద్దరు ఫ్లైట్ కెడెట్స్, మిత్రదేశాలకు చెందిన చెందిన ఒక అధికారి శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరికి కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్ డిప్యూటీ కమాండెంట్, ఎయిర్ కమోడోర్ లలిత్‌కు మార్జైన్ ట్రోఫీలను, సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఫ్లైట్ కెడెట్స్‌కు జూన్ 15న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహిస్తున్న కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో కమిషన్డ్ అధికారులుగా పదోన్నతి లభిస్తుంది.


సమావేశంలో పాల్గొన్న నావిగేషన్ అధికారులు

గెలుపెవరిదో?

(5వ పేజీ తరువాయి)

సర్వశక్తులూ ఒడ్డాయి. నగరంపై పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ముందుకు సాగగా.. నగర ఓటర్లలో ఆదరణ ఉందని భావించే బీజేపీ దానిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని పకడ్బందీ కార్యాచరణ అమలు చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకున్న బీఆర్ఎస్ గ్రేటర్‌పై తమ పట్టు సడలలేదని చాటేందుకు ప్రయత్నం చేసింది. సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి 45 మంది అభ్యర్థులు పోటీ చేశారు. 21.20 లక్షల ఓట్లకుగాను.. 10.39 లక్షలు (49.04 శాతం), హైదరాబాద్‌లో 30 మంది పోటీ చేయగా, 22.17 లక్షల ఓట్లకుగాను.. 10.74 (48.48 శాతం), మల్కాజిగిరిలో 22 మంది బరిలో ఉండగా.. 37.80 లక్షల ఓట్లకుగాను 19.19 లక్షలు(50.78 శాతం) పోలయ్యాయి. దాదాపుగా అన్ని స్థానాల్లో ఒకటి, రెండు శాతం మినహా సగం ఓట్లు పోలయ్యాయి. వీరిలో ఎవరు ఏ పార్టీని ఆదరించారన్నది ఆసక్తికరంగా మారింది.

అసెంబ్లీ ఎన్నికల్లో అలా.. ఇప్పుడు ఎలా?

ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లోని 24 స్థానాలకుగాను 16 చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించింది. ఏడు నియోజకవర్గాల్లో ఎంఐఎం, ఒక స్థానాన్ని బీజేపీ దక్కించుకున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో మహానగర ఓటరు తీర్పు ఎలా ఉండనుందనేది ఆసక్తికరంగా మారింది. శాసనసభ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు భిన్నంగా ఆలోచించారని, ఫలితాలూ దానినే ప్రతిబింబిస్తాయని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి లాభం జరగనుంది? నష్టపోయేది ఎవరు..? అన్నది రేపు తేలనుంది. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించిన ఓ వర్గం.. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికలు కావడంతో గులాబీ పార్టీ వైపు మొగ్గు చూపలేదని పోలింగ్ రోజు పరిస్థితులు స్పష్టం చేశాయి.

సెగ్మెంట్ల వివరాలు క్రోడీకరించి..

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో సెగ్మెంట్ల వారీగా ఉండే ఏఆర్‌ఓలు ప్రతి రౌండ్ ఫలితాలను రిటర్నింగ్ అధికారికి నివేదిస్తారు. ఆ తర్వాతే సంబంధిత లోక్‌సభ స్థానానికి సంబంధించిన ఫలితం అధికారికంగా వెలువడుతుంది. సెగ్మెంట్ల వారీగా ఎక్కడికక్కడ వివరాలు వెల్లడించినా.. అన్నీ క్రోడీకరించి ప్రకటించేందుకు గంట నుంచి గంటన్నర సమయం పడుతుందని ఓ అధికారి తెలిపారు. ఓట్ల లెక్కింపుపై నేడు రెండో విడత శిక్షణ జరుగుతుంది. అంతకుముందు ఉదయం 6 గంటలకు సిబ్బంది ర్యాండమైజేషన్ ఉంటుంది. ఎవరిని ఏ నియోజకవర్గానికి పంపాలనేది నిర్ణయిస్తారు. మంగళవారం ఉదయం 6 గంటలకు సిబ్బందికి టేబుళ్లు కేటాయిస్తారు. 6.30 గంటలకు అభ్యర్థులు/వారి ఏజెంట్లు, కేంద్ర ఎన్నికల పరిశీలకుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేస్తు స్ట్రాంగ్ రూంలు తెరుస్తారు. 8 గంటలకు లెక్కింపు మొదలవుతుంది.

లెక్కింపు కేంద్రాలు..

పార్లమెంట్	అసెంబ్లీ నియోజకవర్గం..	కౌంటింగ్ కేంద్రం
సికింద్రాబాద్ పార్లమెంట్..	ముషీరాబాద్	ఏవీకాలేజీ, దోమలగూడ
	అంబర్‌పేట	రెడ్డి కాలేజీ, నారాయణగూడ
	ఖైరతాబాద్	కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం, యూసుఫ్‌గూడ
	జూబ్లీహిల్స్	కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం, యూసుఫ్‌గూడ
	సనత్‌నగర్	ఉస్మానియా యూనివర్సిటీ (కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్)
	నాంపల్లి	కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (జేఎన్ఏఎఫ్ఏయూ), మాసబ్‌ట్యాంక్
	సికింద్రాబాద్	ఉస్మానియా యూనివర్సిటీ, రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్
హైదరాబాద్ పార్లమెంట్..	కార్వాన్	గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, మాసబ్‌ట్యాంక్
	గోషామహల్	తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం, కోఠి (ఉమెన్స్ కాలేజ్)
	చార్మినార్	కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజ్ ఫర్ ఉమెన్, నాంపల్లి
	చాంద్రాయణగుట్ట	నిజాం కాలేజ్ లైబ్రరీ హాల్, బషీర్‌బాగ్
	యాకుత్‌పురా	సరోజిని నాయుడు వనితా మహిళావిద్యాలయం, నాంపల్లి
	బర్కత్‌పురా	అరోరాస్ లీగల్ సైన్సెస్, బండ్లగూడ, చాంద్రాయణగుట్ట
	మలక్‌పేట	అంబర్‌పేట జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియం